


వెండి నాగ పడగ సమర్పణ

మోపిదేవి: వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి గుంటూరుకు చెందిన గోరంట్ల వేణునాథ్ రూ.1,10,000 విలువైన వెండి నాగ పడగను బుధవారం సమర్పించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద బుధవారం 2,423 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 1,179 క్యూసెక్కులు వదిలారు.

శాకంబరిగా కన్యకా పరమేశ్వరి



అమరావతి: అమరావతిలో వేంచేసియున్న కన్యకా పరమేశ్వరి దేవిని ఆషాఢ మాసం సందర్భంగా శాకంబరీ దేవిగా బుధవారం అలంకరించారు. ఆర్య వైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో భక్తులు ఊరేగింపుగా వచ్చి సారె సమర్పించారు.

న్యూస్‌రీల్

డీఎస్పీల బదిలీ

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): రాష్ట్ర వ్యాప్తంగా 96 మంది డీఎస్పీలను బుధవారం బదిలీ చేశారు. ఈ మేరకు గుంటూరు రేంజ్‌లో పలువురు డీఎస్పీలు బదిలీయ్యారు. గుంటూరు డీసీఆర్‌బీ డీఎస్పీ పి.శ్రీనివాసరావును కాశీబుగ్గకు, గుంటూరు ట్రాఫిక్ డీఎస్పీ వీవీనాయుడును విజయవాడ ఏసీపీ ట్రాఫిక్ డివిజన్–1కు, విజయవాడ ఏసీపీ ట్రాఫిక్ డివిజన్–1 డీఎస్పీ బి.జనార్దనరావును గుంటూరు జిల్లా తెనాలి సబ్ డివిజన్‌కు, గుంటూరు ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ పి.మల్లికార్జునరావును విజయవాడ దిశకు, గుంటూరు నార్త్ డీఎస్పీ సీహెచ్.రవికాంత్, గుంటూరు సౌత్ డీఎస్పీ ఎండీ.మెహబూబ్‌బాషా, గురజాల డీఎస్పీ సీహెచ్.శ్రీనివాసరావును పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. వెయింటింగ్‌లో ఉన్న డీఎస్పీ బి.ప్రసాద్‌ను పల్నాడు దిశ (ఉమెన్)కు బదిలీ చేశారు.

గుంటూరు కమిషనర్‌గా హరికృష్ణ బాధ్యతల స్వీకరణ

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా పూర్తి అదనపు బాధ్యతల(ఎఫ్ఏసీ)పై ఎస్.హరికృష్ణ బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన అదనపు కమిషనర్, డెప్యూటీ కమిషనర్లు, విభాగాధిపతులతో పెన్షన్ పంపిణీ, ఇతర అంశాలపై సమీక్షించారు. పలు సూచనలు చేశారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున మెరుగైన పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. అవుట్ ఫాల్ డ్రెయిన్లలో వర్షపు నీరు నిల్వ లేకుండా పర్యవేక్షించాలని, తాగు నీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని ఇంజినీరింగ్ అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం విభాగాధిపతులు, అధికారులు కమిషనర్‌కు పూల బొకేలు అందించి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.రాజ్యలక్ష్మి, డెప్యూటీ కమిషనర్లు సీహెచ్.శ్రీనివాస్, వెంకటలక్ష్మి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎస్ఈ శ్యాం సుందర్, ఎంహెచ్ఓ మధుసూదన్, మేనేజర్ ఎస్.ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించిన సీఎండీ



తాడేపల్లిరూరల్: తాడేపల్లిలోని సీతానగరం విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఏపీసీపీడీసీఎల్ సీఎండీ రవి సుభాష్‌బాబు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తాడేపల్లి పట్టణంలో విద్యుత్ అంతరాయాల నివారణకు అధికారులకు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్డీఏ సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ డాక్టర్ పి.విజయకుమార్, ఈఈ రాంబొట్లు, డెప్యూటీ ఈఈ అక్కల సత్యనారాయణ, ఏఈలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: గుజ్జనగుండ్లలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 2న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.రఘు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫెయిర్ డీల్ క్యాపిటల్, హెచ్–1 హెచ్ఆర్ సొల్యూషన్స్, కేప్‌స్టన్ సర్వీసెస్, ఫ్లిప్‌కార్ట్ సంస్థల్లో ఉద్యోగాల భర్తీ కోసం టెన్త్, ఇంటర్, డిగ్రీ, బీటెక్, ఎంబీఏ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు గల నిరుద్యోగ యువత జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 98668 22697, 87907 90762 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): ఆగస్టు పెన్షన్ల పంపిణీకి రంగం సిద్ధమైంది. సాధ్యమైనంత వరకు ఒకటో తేదీన 99 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఎవరైనా ఆ రోజు తీసుకోలేకపోతే 2న విధిగా పంపిణీ చేయాల్సి ఉంది. గుంటూరు జిల్లాలో 2,60,192 మంది లబ్ధిదారులకు రూ.110.69 కోట్లు విడుదలయ్యాయి. బుధవారమే ఈ నగదును బ్యాంకుల నుంచి డ్రా చేసుకున్నారు. ఒకటో తేదీ ఉదయం ఆరు గంటల నుంచే పంపిణీని మొదలు పెట్టాలని సిబ్బందికి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

ఒక్కో ఉద్యోగికి 50 నుంచి 100 పెన్షన్లు

గుంటూరు జిల్లాలో 4,840 మంది సచివాలయ, ఇతర శాఖల సిబ్బందితో పింఛన్ల పంపిణీకి అధికారులు రంగం సిద్ధం చేశారు. ఒక్కో ఉద్యోగికి 50 నుంచి వంద మంది లబ్ధిదారులను మ్యాపింగ్ చేసినట్టు సమాచారం.

మనీ ట్రాన్స్‌ఫర్లు

- జోరందుకున్న పైరవీలు
- సామాజికవర్గాల ప్రాతిపదికన పోస్టింగులు
- రేపల్లె, బాపట్ల, వేమూరుల్లో గౌడ, కాపు అధికారులకు ప్రాధాన్యం
- పర్చూరు, అద్దంకిలో కమ్మ అధికారులకు పోస్టింగులు
- చీరాలలో యాదవులకు అవకాశం
- ఎస్ఐ పోస్టింగ్‌కు రూ. 10 లక్షలు
- చీరాల, మార్టూరు సీఐ పోస్టింగులకు రూ.20 నుంచి 30 లక్షలు
- కొన్ని సెంటర్లలో రూ. 15 నుంచి 20 లక్షలు
- ఆర్డీవో, తహసీల్దార్ పోస్టులకు డిమాండ్
- నేతల చుట్టూ అధికారుల ప్రదక్షిణలు

బదిలీల పర్వంలో సామాజిక వర్గాల పరంగా అధికార పార్టీ ఎమ్మెల్యేలు దోపిడీకి తెరలేపారు. 'తమ్ముడు తమ్ముడే.. పేకాట పేకాటే అన్నట్లు' వ్యవహరిస్తున్నారు. ఆదాయం వచ్చేచోట 'మనోడైతే ఒక రేటు.. ఇంకొకరు అయితే ఇంకో రేటు' తీసుకుంటున్నారు. అధికారులు కూడా జీతం కన్నా గీతంకు ఆశపడి బహిరంగ మార్కెట్‌లో పోటీలు పడి పోసుల్టు కొనుక్కుంటున్నారు. ఇక ఆదాయం వచ్చే పోలీస్ స్టేషన్లలో పోస్టింగ్‌ల కోసం ఖాకీలు పచ్చ నేతల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. కాసులు కురిపించే స్టేషన్‌లో తిష్ట వేయడానికి అడిగినంత ముట్ట చెప్పడానికి సిద్ధమవుతున్నారు.



సాక్షి ప్రతినిధి, బాపట్ల: జిల్లాలో బదిలీల కోసం అధికారుల పైరవీలు పతాకస్థాయికి చేరాయి. కొందరు అధికార పార్టీ నేతలు సామాజిక వర్గాలకు ప్రాధాన్యత ఇస్తుండగా, మరికొందరు ముడుపులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. బది'లీలల'పై అధికారులతోపాటు సొంత పార్టీ వర్గాల్లోనూ గుసగుసలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఆదాయ వనరులు అధికంగా ఉన్న కేంద్రాల్లో పోస్టింగుల కోసం అడిగినంత రేటు వెచ్చించడానికి కొందరు అధికారులు సిద్ధపడుతున్నారు. ప్రధానంగా రెవెన్యూ, పోలీసు శాఖల పరిధిలో ఈ ముడుపుల వ్యవహారం జోరందుకుంది. రేపల్లె, చీరాల, బాపట్ల ఆర్డీవోలతో పాటు బాపట్ల, మార్టూరు, సంతమాగులూరుతో పాటు జిల్లాలోని పలు సెంటర్లలో తహసీల్దారు పోస్టులకు డిమాండ్ ఉంది. ఆదాయం ఉన్న చోట పోస్టింగుల కోసం పలువురు అధికారులు ఇప్పటికే పైరవీ వ్యవహారం దాదాపు పూర్తి చేసినట్లు తెలుస్తోంది. రూ. 10 నుంచి రూ.15 లక్షలు సమర్పించేందుకు కొందరు సిద్ధంగా అన్నట్లు సమాచారం.

ఈ స్టేషన్లు చాలా హాట్ గురూ!

- చీరాల నియోజకవర్గంలో సీఐ, ఎస్ఐ పోస్టుల కోసం కొందరు అధికారులు పోటీ పడుతున్నారు. అయితే, ఇక్కడి టీడీపీ నేత బీసీ వర్గానికి చెందిన అధికారులకు ప్రాధాన్యం నిస్తున్నట్లు సమాచారం. దీంతో కొందరు యాదవ సామాజిక వర్గం అధికారులు చీరాలలో పోస్టింగ్‌ల కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది.
- వేమూరు, రేపల్లె , బాపట్ల నియోజకవర్గాల్లోనూ సీఐ, ఎస్ఐ పోస్టులకు డిమాండ్ నెలకొంది. ఈ నియోజకవర్గంలో అధికారపార్టీ నేతలు నిత్యం పేకాట, కోడిపందాల కేంద్రాలు పెద్దఎత్తున నిర్వహిస్తుంటారు. దీంతో ఇక్కడ పోలీసులకు రాబడి అధికంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో సీఐ పోస్టుకు రూ. 20 నుంచి రూ. 30 లక్షలు పలుకుతుండగా ఎస్ఐ పోస్టుకు రూ. 10 లక్షలు తక్కువ లేకుండా ఉంది. అయినా ఇక్కడ పోస్టింగుల కోసం అధికారులు పోటీపడుతున్నట్లు తెలుస్తోంది. ఎలాగైనా దక్కించుకునేందుకు పలువురు సీఐ, ఎస్ఐలు అధికార పార్టీ నేతల్ని కలిసి ఇప్పటికే పనిని చక్కబెట్టుకున్నట్లు సమాచారం. మొత్తంగా జిల్లాలో పోస్టింగుల కోసం కొందరు రెవెన్యూ, పోలీసు అధికారులు పెద్దఎత్తున ముడుపులు సమర్పించుకున్నట్లు ఆయా వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి.

పోలీసు శాఖలో పైరవీల జోరు

ఇక పోలీసు శాఖలో పైరవీల వ్యవహారం జోరందుకుంది. కొందరు డీఎస్పీ, సీఐలు పోస్టింగుల కోసం పెద్దఎత్తున లాబీయింగ్ సాగిస్తున్నారు. కొందరు సీఐలు రూ. 20 లక్షల నుంచి రూ. 30 లక్షలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఉదాహరణకు గ్రానైట్ రవాణాతో ఆదాయ వనరులు దండిగా ఉన్న మార్టూరు సీఐ, ఎస్ఐ పోస్టుల్లో అధికారపార్టీ నేతలు కమ్మ సామాజికవర్గం వారిని నియమించేందుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం మార్టూరు సీఐగా ఉన్న రాజశేఖరరెడ్డిని బదిలీ చేయించి ఆయన స్థానంలో కమ్మ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని సీఐగా నియమించనున్నట్లు తెలుస్తోంది. గతంలో మార్టూరు ఎస్ఐగా పనిచేసి ప్రస్తుతం సీఐ హోదాలో ఉన్న ఇద్దరు అధికారులు పోటీ పడుతుండగా వారిలో తనకు అత్యంత సన్నితంగా ఉన్న వ్యక్తికి అధికారపార్టీ నేత గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ఇదే పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ పోస్టుకు సైతం పెద్దఎత్తున డిమాండ్ నెలకొంది. గ్రానైట్ మామూళ్లు వసూలు చేసే బాధ్యత ఎస్ఐకి అప్పగించడం ఇక్కడ ఆనవాయితీ. దీంతో వచ్చే రాబడిలో ఆయన వాటాకూడా పెద్ద మొత్తంలోనే ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎస్ఐ పోస్టుకు డిమాండ్ ఉంది. గతంలో మార్టూరు ఎస్ఐలుగా పనిచేసిన కమ్మ సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మరలా ఇక్కడే పోస్టింగ్ కోసం ఇప్పటికే అధికారపార్టీనేతను కలిశారు. రూ 10 లక్షలు ఇచ్చేందుకు ఇద్దరు సిద్ధపడినట్లు ప్రచారం ఉంది. ఇద్దరిలో ఒకరికే పోస్టు దక్కనుంది. ఇక రూరల్ సీఐ పోస్టుకోసం ఒక అధికారి ప్రయత్నిస్తున్నారు. ఇక్కడ కమ్మ సామాజిక వర్గానికే అధికారపార్టీ నేత ప్రాధాన్యత నిస్తున్నట్లు తెలుస్తోంది.



జిల్లా అభివృద్ధిపై నివేదిక సిద్ధం చేయండి

అధికారులకు కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశం



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: జిల్లా అభివృద్ధికి భవిష్యత్‌లో చేపట్టాల్సిన అంశాలతో సంక్షిప్త నివేదిక తయారు చేయాలని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి తెలిపారు. బాపట్ల జిల్లా అభివృద్ధిపై అన్ని శాఖల జిల్లా అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్ ఆయన సమావేశం నిర్వహించారు. బాపట్ల అభివృద్ధికి ముఖ్యమైన ఆక్వా పార్క్, నిజాంపట్నం పోర్టు విస్తరణ, వాడరేవు విస్తరణ, చేనేత పార్క్, బీచ్‌ల అభివృద్ధి, వైద్య కళాశాల నిర్మాణాలపై నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సూపర్ సిక్స్ విధానం కింద ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టనుందని తెలిపారు. చీరాలలో జిల్లా స్థాయి వైద్యశాల ఏర్పాటు, బాపట్ల ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ భవన నిర్మాణం, అద్దంకిలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటుపై ప్రణాళిక రూపొందించాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన పశువైద్యశాలల భవనాల నిర్మాణం, జిల్లాలోని ప్రధాన రహదారుల్ని కలుపుతూ 80 కిలోమీటర్ల మేర ఆర్ అండ్ బీ రహదారి నిర్మాణానికి రూ.83 కోట్లు మంజూరు, బాపట్ల పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి రెండో సమ్మర్ స్టోరేజ్ నిర్మాణాలకు ప్రభుత్వం నుంచి అధికారికంగా అనుమతి కోసం నివేదికను ప్రభుత్వానికి పంపాలని వివరించారు. తల్లిపాల వారోత్సవాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. అనంతరం కార్యక్రమ పోస్టర్లను ఆయన విడుదల చేశారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి. సుబ్బారావు, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు పాల్గొన్నారు.


నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

- జిల్లాలోని 1,888 కేంద్రాల్లో కార్యక్రమాలు
- జిల్లాలో 8,101 మంది గర్భిణులకు అవగాహన



బాపట్ల టౌన్: తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేసేందుకే మహిళా, శిశుసంక్షేమ శాఖ వారోత్సవాలకు సిద్ధమైంది. జిల్లాలోని 8,101 మంది గర్భిణులకు ఈనెల 1 నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల అవశ్యకత, బిడ్డ పోషణ, ఆరోగ్యంపై జిల్లాలోని 1888 అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు, సదస్సులు నిర్వహించనున్నారు. 1న ప్రాజెక్ట్ పరిధిలోని సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లతో సమావేశాలు, 2న తల్లి పాలు ఇచ్చే విధానంపై చర్చ, అవగాహన సదస్సులు , వయోజనులు, బాలికల కళాశాలల్లో శిక్షణ ఉంటాయి. 3న రేడియో, టీవీల్లో టెలివిజన్‌లో ప్రసారమయ్యే కార్యక్రమాల వీక్షణ, 5న కేంద్రం పరిధిలో గర్భిణులు, బాలింతల ఇంటికి వెళ్లి తల్లిపాలపై అవగాహన కల్పించడం నిర్వహిస్తారు. 6న ప్రాజెక్ట్ పరిధిలో ర్యాలీలు, 7న సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి గర్భిణులు, బాలింతలకు తల్లిపాల గురించి ప్రయోజనాలు వివరించడంతో పాటు చైతన్యవంతుల్ని చేస్తారు.

తల్లిపాలపై చైతన్యవంతుల్ని చేస్తాం



బిడ్డకు ఆరుమాసాలు వచ్చేవరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి. బిడ్డకు అవసరమైన శక్తి వీటి ద్వారానే వస్తుంది. ఈ మేరకు వారోత్సవాలలో తల్లులు, బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పిస్తాం.

– ఉమ, పీడీ, మహిళా, శిశు సంక్షేమ శాఖ, బాపట్ల జిల్లా

మనవడే కాలయముడయ్యాడు

- అన్నం పెట్టలేదని గోడకేసి కొట్టాడు
- తీవ్ర రక్తస్రావంతో వృద్ధురాలి మృతి



షేక్ రాజాంబీ



బంధువుల నుంచి వివరాలు సేకరిస్తున్న చీరాల డీఎస్పీ, సీఐలు

కారంచేడు: తల్లిదండ్రులు చనపోతే మనవడిని అక్కున చేర్చుకుంది. ఒడిలో లాలించి, కమ్మని కథలు చెప్పింది. ఆకలైతే గోరు ముద్దలు తినిపించింది. పెద్ద దిక్కుగా ఉంటూ సుద్దులెన్నో చెప్పింది. అయితే, వాటిని మరచి అమ్మమ్మ పాలిట రాక్షసుడిలా వ్యవహరించాడు. అడిగిన సమయంలో అన్నం పెట్టలేదనే కోపంతో మనవడు అమ్మమ్మను గోడకేసి కొట్టడంతో ఆమె తలకు గాయాలై రక్తస్రావంతో మృతి చెందింది. ఈ సంఘటన మంగళవార రాత్రి 9.30 గంటల సమయంలో జరగ్గా, బుధవారం మధ్యాహ్నం 12 గంటల తరువాత వెలుగులోకి వచ్చింది. బాపట్ల జిల్లా చీరాల ఇన్‌చార్జ్ డీఎస్పీ పి.జగదీష్‌నాయక్, ఇంకొల్లు సీఐ బి.శ్రీనివాసరావు, చినగంజాం ఎస్ఐ శ్రీనివాసరావు సంఘటన స్థలాన్ని సందర్శించి బంధువుల నుంచి వివరాలు సేకరించారు. పోలీసుల కథనం మేరకు.. మండల కేంద్రమైన కారంచేడు పీహెచ్‌సీ ఎదురుగా నివాసముంటున్న షేక్ రాజాంబీ (75) భర్త మృతితో ఒంటరిగా జీవిస్తోంది. ఈమె మనవడు (కుమార్తె కొడుకు) షేక్ బాజీ (28) కూడా తల్లిదండ్రులు మృతిచెందడంతో ఆమె దగ్గరే ఉంటున్నాడు. ఇటీవల కొద్ది రోజులుగా మతిస్థిమితం లేనివాడిగా తిరుగుతున్నాడని గ్రామస్తులు చెబుతున్నారు. ఒకే ఇంటిలో అమ్మమ్మ, మనవడు ఉంటున్నారు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి బాజీ అమ్మమ్మను అన్నం వడ్డించమన్నాడు. తాను తింటున్నానని, కొద్ది సేపు ఉండు వడ్డిస్తానని చెప్పడంతో కోపోద్రిక్తుడైన బాజీ వృద్ధురాలి తలను పట్టుకొని గోడకేసి కొట్టాడు. దీంతో ఆమె తీవ్ర రక్తస్రావంతో మృతి చెందింది. బాజీ మాత్రం ఏమీ తెలియని వ్యక్తిలా ఇంట్లోనే ఉన్నాడు. బుధవారం మధ్యాహ్నం వృద్ధురాలు మృతి చెందినట్లు గుర్తించిన స్థానికులు గుంటూరులో ఉంటున్న రాజాంబీ అక్క కొడుకు షేక్ మస్తాన్‌వలికి సమాచారం ఇచ్చారు. అతను కారంచేడు వచ్చి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలానికి వచ్చిన పోలీసులు బంధువులు, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని చీరాల ప్రభుత్వ ఆస్పత్రికి పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి, నిందితుడు షేక్ బాజీని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

జూదాలతో కుటుంబాలు ఛిన్నాభిన్నం

- పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టి కళ్లెం వేయాలి
- వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు



ఎస్ఐతో మాట్లాడుతున్న అశోక్‌బాబు

భట్టిప్రోలు: వేమూరు నియోజకవర్గంలోని భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో విచ్చల విడిగా నిర్వహిస్తున్న కోడి పందేలు, పేకాట స్థావరాలపై పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టి కళ్లెం వేయాలని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు కోరారు. పేకాటలో ఇదిగో నీవాటా! అనే శీర్షికన సాక్షి బాపట్లలో ప్రచురితమైన కథనం నేపథ్యంలో బుధవారం ఆయన భట్టిప్రోలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎస్ఐ కాసుల శ్రీనివాసరావును కలసి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ వేమూరు, రేపల్లె నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, కూటమి నేతల ఆధ్వర్యంలో ఈ తంతు మూడు పువ్వులు..ఆరుకాయల చందాన జరుగుతోందని తెలిపారు. వీటి వల్ల కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయని, అడ్డుకట్ట వేయకపోతే పరిస్థితి చేయి జారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. జూదాల నిర్వహణ వెనుక పాలక పక్షాల పాత్ర ప్రస్ఫుటంగా కనిపిస్తోందని ఆరోపించారు. ఇందులో ఎవరి వాటాలు వారికి అందడంతో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని, పోలీసులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తే ఆందోళన చేయనున్నట్లు హెచ్చరించారు. తీగలాగితే డొంక కదిలిన విధంగా ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిందని.....సాక్షిలో వచ్చిన కథనంపై జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అప్రమత్తమై కోడి పందేలు, పేకాటలపై ఉక్కుపాదం మోపేలా చర్యలు తీసుకోవడం శుభ పరిణామని పేర్కొన్నారు. అనంతపురం టీడీపీ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ రాష్ట్రవ్యాప్తంగా పేకాట క్లబ్బులను తెరిపించే అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళతాననడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పేకాట ఆడకపోవడం వల్ల మనిషి జీవిత కాలం తగ్గిపోతుందని చెప్పడం విడ్డూరంగా ఉందని తెలిపారు.

చర్చా వేదికకు సిద్ధం

భట్టిప్రోలు మండలంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా ఆధ్వర్యంలో పందేలు, జూదాలు, అక్రమ ఇసుక దందాపై చర్చించేందుకు ఈ నెల 3న భట్టిప్రోలు రథం సెంటర్‌లో ఏర్పాటు చేసే చర్చా వేదికకు తాను సిద్ధమేనని అశోక్‌బాబు స్పష్టం చేశారు. కోడిపందేల నిర్వహణ, జంతు హింస చట్ట నిబంధనలకు విరుద్ధమని గుర్తు చేశారు. వీటిని నిరోధించాలని హైకోర్టు గతంలో కీలక ఉత్తర్వులు ఇచ్చినా అధికారులు అమలు చేయడం లేదని పేర్కొన్నారు. చట్టాల్ని సక్రమంగా అమలు చేయకపోతే కలెక్టర్, పోలీస్ కమిషనర్, ఎస్పీలు వ్యక్తిగతంగా బాధ్యులవుతారని హెచ్చరించారు. జంతు హింస నిరోధక చట్టం–1960, ఏపీ జూద నిరోధక చట్టం –1974ను కఠినంగా అమలు చేయాలని అశోక్‌బాబు డిమాండ్ చేశారు. సాయిబాబా ఉరి వేసుకుంటానని పదే పదే బెదిరిస్తున్నారని.... అతనిపై సుమోటాగా కేసు తీసుకోవాలని పోలీసుల్ని కోరారు. ఇదిలా ఉండగా కూటమి నాయకులు 3వ తేదీన భట్టిప్రోలులో జరిగే చర్చా వేదికకు మద్దతుగా వస్తారో లేదో వేచి చూడాల్సిందే మరి. చర్చా వేదికకు అనుమతి ఇచ్చేందుకు అవకాశం లేదని, నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అశోక్‌బాబుకు పోలీసులు తెలిపినట్లు సమాచారం.

పటిష్ట నిఘాతో గంజాయికి అడ్డుకట్ట

- జిల్లా ఎస్పీ తుషార్ డూడి
- విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు
- నిజాంపట్నం స్టేషన్ ఆకస్మిక తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడి

నిజాంపట్నం (రేపల్లె రూరల్): గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల్ని సమూలంగా అరికట్టేందుకు సిబ్బంది ప్రత్యేక నిఘా ఉంచాలని బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశించారు. నిజాంపట్నం పోలీసు స్టేషన్‌ను బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి, ఇతర మత్తు పదార్థాల్ని నివారించేందుకు సూచించిన ప్లాన్ ఆఫ్ యాక్షన్‌ను సమర్థంగా అమలు చేయాలని సిబ్బందికి సూచించారు. నేరాల నియంత్రణకు పగలు, రాత్రి సమయాల్లో గస్తీ, పెట్రోలింగ్‌లను మరింత పెంచాలని చెప్పారు. పాఠశాలలు, కళాశాలలు, ముఖ్యమైన ప్రదేశాలలో పోలీస్ సిబ్బంది తరచూ పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు సీసీ కెమెరాలను అమర్చాలని తెలిపారు. నేర నియంత్రణకు, అనుమానితుల్ని పరిశీలించేందుకు కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని చెప్పారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ వారి సమస్యల్ని అడిగి తెలుసుకోవాలని సూచించారు. మహిళలు, చిన్నపిల్లలతో అమర్యాదగా, అసభ్యంగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళా సంబంధిత కేసుల దర్యాప్తును వేగవంతంగా నిర్వహించాలని, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని తెలిపారు. చెడు నడత కలిగిన వారిపై, గతంలో వివిధ నేరాలకు పాల్పడిన వారిపై నిఘా ఉంచాలని చెప్పారు. నిజాంపట్నం హార్బర్ వద్ద తగిన భద్రత చర్యలు చేపట్టాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిరంతరం పరివేక్షించాలని సూచించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టం చేశారు. తొలుత స్టేషన్ పరిసరాలతో పాటు క్రైం రికార్డులను తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో ఎక్కువగా జరిగిన నేరాల గురించి పోలీస్ అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో వ్యక్తిగతంగా మాట్లాడి వారి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిజాంపట్నం హార్బర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో రేపల్లె రూరల్ సీఐ ఏ.మల్లికార్జునరావు, నిజాంపట్నం ఎస్ఐ జి.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

తెనాలి డీఎస్పీగా జనార్దనరావు



తెనాలిరూరల్: తెనాలి డీఎస్పీగా బి.జనార్దనరావు తిరిగి నియమితులయ్యారు. గతేడాది మే 10వ తేదీన ఇక్కడ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన ఆయన ఎన్నికల బదిలీల్లో భాగంగా విజయవాడ ట్రాఫిక్ డివిజన్–1 ఏసీపీగా ఫిబ్రవరిలో బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో మైలవరం ఏసీపీగా పని చేస్తూ ఎం.రమేష్ ఇక్కడకు వచ్చారు. ప్రస్తుతం ఆయన్ను పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్టు చేయాల్సిందిగా డీజీపీ ద్వారకా తిరుమలరావు ఆదేశాలు జారీ చేశారు. కాగా 1995 బ్యాచ్‌కు చెందిన జనార్దనరావు ఉమ్మడి కృష్ణా జిల్లాలో వివిధ స్టేషన్లలో ఎస్‌ఐగా పని చేసి సీఐగా పదోన్నతి పొంది సీఐడీ విభాగంలో పని చేశారు. 2019లో డీఎస్పీగా పదోన్నతి పొంది అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)లో పని చేశారు.

కొనసాగుతున్న బాలికల బాస్కెట్ బాల్ పోటీలు



గుంటూరు రూరల్: మండలంలోని నల్లపాడులోని లయోలా పాఠశాలలో ఆంధ్రా, తెలంగాణ ఐసీఎస్‌ఈ, ఐఎస్‌ఈ రీజినల్ స్థాయి బాలికల బాస్కెట్ బాల్ పోటీలు రెండో రోజు బుధవారం కొనసాగాయి. అండర్–14, అండర్– 17, అండర్– 19 విభాగాల్లో మొత్తం 45 జట్లు తలపడ్డాయి. పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ సురేష్‌కుమార్ మాట్లాడుతూ గెలుపు ఓటములు సహజమని క్రీడల్లో నైపుణ్యతలు మెరుగుదిద్దుకునే దిశగా క్రీడాకారులు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల సుపీరియర్ ఫాదర్ ఆంథోని పాల్గొన్నారు.

ఫిరంగిపురంలో 42.8 మి.మీ. వర్షం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు అత్యధికంగా ఫిరంగిపురం మండలంలో 42.8 మిల్లీ మీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా కాకుమాను మండలంలో 1.2 మి.మీ. వర్షం పడింది. సగటున 19.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు.. తాడికొండ 35.2, దుగ్గిరాల 30.8, గుంటూరు తూర్పు 28.2, మంగళగిరి 28.2, ప్రత్తిపాడు 25.4, వట్టిచెరుకూరు 23.4, మేడికొండూరు 22.2, పెదకాకాని 21.4, తుళ్లూరు 20.8, గుంటూరు పశ్చిమ 18.8, తాడేపల్లి 18.6, కొల్లిపర 12.8, చేబ్రోలు 7, తెనాలి 5.8, పొన్నూరు 3.2, పెదకాకాని మండలంలో 2.2 మి.మీ. చొప్పున వర్షం పడింది. జూలై మాసంలో జిల్లా సాధారణ వర్షపాతం 164.9 మి.మీ. నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 216.9 మి.మీ వర్షపాతం పడింది.

విద్యార్థులకు హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు పద్మావతి

చీరాల అర్బన్: విద్యార్థులు కూడా తమ హక్కుల గురించి తెలుసుకోవాలని స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ మెంబర్ బి.పద్మావతి సూచించారు. చీరాలలోని ఏపీ మోడల్ పాఠశాలను ఆమె బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు హక్కుల గురించి, సమాజంలో పిల్లలపైన జరిగే దాడుల నుంచి రక్షించుకునే విధానాన్ని వివరించారు. అనంతరం పాఠశాల ఆవరణను పరిశీలించారు. వెనుక పెరిగిన పిచ్చి మొక్కలు తొలగించాలని, మరింత పరిశుభ్రత పాటించాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలలో ఫిర్యాదు బాక్సును సక్రమంగా నిర్వహించి సమస్యలకు పరిష్కారం చూపాలని, రిజిస్టర్‌లో నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. బోధనలో నాణ్యత పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎస్సీపీసీఆర్ జిల్లా మెంబర్లు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చర్యలు

బాపట్ల: ప్రభుత్వశాఖల సహాయ, సహకారాలతో జిల్లాను డ్రగ్స్‌రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి తెలిపారు. బాపట్లలోని వివిధ శాఖల అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బత్తుల పద్మావతి మాట్లాడుతూ రాష్ట్రంలో డ్రగ్స్ నియంత్రణ కోసం పిల్లలు, తల్లిదండ్రులతో కమిటీలను ఏర్పాటు చేసి వారిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. మద్యం దుకాణాలు, మెడికల్ షాపుల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. పాఠశాలలు, హాస్టల్స్‌కు సమీపంలో మద్యం షాపుల్ని వెంటనే తొలగించాలని జాయింట్ కలెక్టర్ బి.సుబ్బారావు ఆదేశించారు. కళాశాలలు వదిలి పెట్టేటప్పుడు పోలీసు శాఖ ఆ ప్రాంతాల్లో ఒక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఎక్సైజ్ శాఖ కూడా బాలలకు మద్యం విక్రయించవద్దంటూ షాపు యజమానులకు ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో జిల్లాల బాలల సంక్షేమ కమిటీ సభ్యురాలు నీలిమ వంశీలత, జిల్లా మహిళా శిశు సంక్షేమశాఖ ప్రాజెక్టు అధికారి కె.ఉమ, పురుషోత్తం, సత్యనారాయణ, డాక్టరు విజయమ్మ పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ చేసిన ముగ్గురు అరెస్టు

బంగారం, బైకు, సీసీ కెమెరాలు స్వాధీనం



విలేకర్లతో మాట్లాడుతున్న ఎస్సై చల్లా సురేష్

శావల్యాపురం: చెడు వ్యసనాలకు బానిసలై చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ చల్లా సురేష్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషనులో విలేకర్ల సమావేశంలో ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 22వ తేదీన శానంపూడి శివారు బొందిలిపాలెం గ్రామంలోని శ్రీ అడవి పేరంటాళ్లమ్మ దేవాలయంలో చోరీ జరిగింది. బల్లికురవ మండలం కొత్తూరుకు చెందిన తన్నీరు నరసింహారావు, బొల్లాపల్లికి చెందిన గోగు నరసింహారావు, వినుకొండకు చెందిన కత్తి మురళి ఈ ఆలయం తాళాలు పగలకొట్టి హుండీలోని 4 గ్రాముల బంగారు ఉంగరం, మూడు సీసీ కెమెరాలు, వెండి పట్టీలు, రూ.700 నగదు చోరీ చేశారు. ప్రత్తిపాడు మండలం తిక్కరెడ్డిపాలెం గ్రామానికి చెందిన సాయి శావల్యాపురం జాతీయ రహదారి వెంట దాబాలో భోజనానికి వెళ్తూ బైకు పార్కింగ్ చేశాడు. ఈ ముగ్గురు దాన్ని చోరీ చేసి, మరుసటి రోజు రాత్రి అమ్మవారి ఆలయంలో దొంగతనానికి పాల్పడినట్లు వెల్లడైంది. వాహనాల తనిఖీ సమయంలో అనుమానం వచ్చి పోలీసులు దర్యాప్తు చేయగా ఈ విషయాలు వెలుగులోకి వచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితులను వినుకొండ కోర్టులో హాజరుపరచగా, రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య

బాపట్ల టౌన్: అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని కొండుబోట్లపాలెంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఆరేపల్లి గోపీకి ఏడాది కిందట ప్రమాదంలో కాలు విరిగింది. అప్పటినుంచి ఇంట్లోనే ఉంటున్నాడు. జీవనం సాగించడం కష్టంగా మారడంతో గ్రామంలోని వ్యక్తుల వద్ద అప్పులు తీసుకున్నాడు. ఇచ్చిన వారు వాటిని తిరిగి చెల్లించమని అడగడంతో మనస్తాపంలో బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు రూరల్ సీఐ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

మద్యం మత్తులో భార్యను కడతేర్చిన భర్త

వెల్లుర్తి: భార్యను మద్యం మత్తులో భర్త కడతేర్చిన సంఘటన మండలంలోని గుడిపాటి చెరువు ప్రాంతంలో బుధవారం చోటుచేసుకుంది. బంధువుల కథనం ప్రకారం.. గుడిపాటి చెరువుకు చెందిన మండ్లి రైతు బయన్న, మల్లమ్మ (50) దంపతులు. మద్యం మత్తులో ఉన్న బయన్నకు భార్యతో బుధవారం చిన్న విషయమై చోటుచేసుకున్న వివాదం చినికి చినికి పెద్దదైంది. ఆ మత్తులో మల్లమ్మపై అతడు దాడి చేశాడు. హత్య చేసిన తర్వాత పారిపోయాడు. మధ్యాహ్నం పక్కింటి వారు మల్లమ్మ కోసం వెళ్లినప్పుడు దారుణం వెలుగు చూసింది. స్థానికుల సమాచారంతో వెల్దుర్తి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రేపు షూటింగ్‌బాల్ జిల్లా జట్ల ఎంపిక

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం గుడిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆగస్టు 2వ తేదీన సబ్ జూనియర్ బాలబాలికల జిల్లా జట్లను ఎంపిక చేయనున్నారు. ఈ మేరకు షూటింగ్ బాల్ అసోసియేషన్ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి కిరణ్ కుమార్ బుధవారం తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్, తల్లిదండ్రుల అంగీకార పత్రంతో హాజరు కావాలన్నారు. ఎంపికైన వారు ఆగస్టు 8వ తేదీ నుంచి చిత్తూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 98486 55755 ఫోను నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

దూరవిద్య టెన్త్, ఇంటర్‌లో ప్రవేశాలు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ ఓపెన్ స్కూల్ ఆధ్వర్యంలో దూరవిద్య టెన్త్, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ బుధవారం తెలిపారు. ఈనెల 20లోగా అడ్మిషన్ ఫీజు చెల్లించి, 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. టెన్త్‌లో చేరేందుకు 14 ఏళ్లు, ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు టెన్త్ పూర్తి చేసి, 15 ఏళ్లు నిండిన వారు ఏపీఓపెన్‌స్కూల్.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర సమాచారం కోసం ఇదే సైట్‌ను సందర్శించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

- హైవేపై ఆగి ఉన్న వాహనాన్ని ఢీకొని..
- తక్కెళ్లపాడు వద్ద ఘటన

పెదకాకాని: జాతీయ రహదారిపై ఆగి ఉన్న వాహనాన్ని వెనుక నుంచి మరో వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన పెదకాకాని పోలీసుస్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. పొన్నూరు ప్రాంతానికి చెందిన మన్నెం కోటయ్య, చౌడూరి శ్రీనివాసరావు, సోమయ్య వాహనంలో తేనె బుట్టలు లోడుతో మంగళవారం కృష్ణాజిల్లా కంచికచర్ల వెళ్లారు. అదే రోజు రాత్రి తిరిగి పొన్నూరు బయలు దేరారు. వారు ప్రయాణిస్తున్న వాహనం జాతీయ రహదారిపై తక్కెళ్లపాడు శివారు ప్రాంతంలోకి చేరుకుంది. అదే సమయంలో ఆ ప్రాంతంలో టైర్ పంక్చర్ కావడంతో రోడ్డుపైనే ఆగిన మరొక వాహన్ని వెనుక నుంచి ఢీ కొట్టింది. ఈ ఘటనలో వాహనంలో ఉన్న చౌడూరి శ్రీనివాసరావు(28) అక్కడికక్కడే మృతి చెందాడు. డ్రైవర్ మన్నెం కోటయ్య, సోమయ్యలకు స్వల్ప గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డ్రైవర్ కోటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

పల్నాడు దిశ డీఎస్పీగా ప్రసాద్

నరసరావుపేట: పల్నాడు జిల్లా దిశ డీఎస్పీగా బి.ప్రసాద్ నియమితులయ్యారు. ప్రభుత్వం బుధవారం రాష్ట్రవ్యాప్తంగా పలువురు డీఎస్పీలకు స్థాన చలనం కలిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో గురజాల డీఎస్పీగా పనిచేస్తున్న సీహెచ్ శ్రీనివాసరావును పోలీసు హెడ్‌క్వార్టర్‌కు రిపోర్టు చేయాలని పేర్కొంది. కాగా, నరసరావుపేట డీఎస్పీగా ఎవరినీ నియమించకపోవటం గమనార్హం.

గుండెపోటమ్మ.. రక్షింపుమమ్మా !



శాకంబరిగా గుండెపోటమ్మ



కూరగాయలతో శివలింగాకృతి

రేపల్లె రూరల్: మండలంలోని పేటేరులో శ్రీ మహాలక్ష్మి గుండెపోటమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం శాకంబరి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. వేకువజామున ఆలయ అర్చకుడు సుమంత్ ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవలతో పంచామృతాలు, పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. పట్టువస్త్రాలు, కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని ఉదయం నుంచి భక్తులు దర్శనం చేసుకుని పసుపు, కుంకుమ, గాజులు, నూతన వస్త్రాలు, పండ్లతో కూడిన సారెను సమర్పించారు. పెరుగన్నం, గారెలతో సద్ది నైవేద్యాలు సమర్పించారు. గ్రామంలోని రైతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిపించడంతో పాటు పాడిపంటలతో చల్లగా చూడాలని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ఆవరణంలో కూరగాయలతో చేసిన అమ్మవారి రూపు, శివలింగాకృతులు భక్తుల్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

నేడు ఎస్‌ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్

- 8న జిల్లాలోని పాఠశాలల్లో ఎన్నికలు
- అదేరోజు ఫలితాలు
- కొత్త కార్యవర్గం ఏర్పాటు

బాపట్ల టౌన్: పాఠశాలల అభివృద్ధిలో విద్యార్థుల తల్లిదండ్రుల్ని భాగస్వామ్యం చేసేందుకు వీలుగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్ మానిటరింగ్ కమిటీ (పీఎంసీ)లను ఏర్పాటు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం దాన్ని స్కూల్ మానిటరింగ్ కమిటీ (ఎస్ఎంసీ)గా మార్పు చేసింది. వీటి ఎన్నికలకు ఆగస్టు 1న నోటిఫికేషన్ విడుదల అవుతుంది. అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ఓటర్ల లిస్టు (తల్లిదండ్రుల) ప్రచురణ చేస్తారు. 5న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల్లోపు ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తారు. ఆగస్టు 8న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు ఎన్నికల్ని తల్లిదండ్రులు చేతులెత్తే పద్ధతిలో నిర్వహిస్తారు. అదే రోజు మధ్యాహ్నం 1.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్లతో ప్రమాణ స్వీకారం చేయిస్తారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి 3.30 గంటల మధ్య తొలి సమావేశాన్ని నిర్వహించే విధంగా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

వైకుంఠపుర వాసునికి రూ. 23 లక్షల ఆదాయం



హుండీ లెక్కిస్తున్న భక్తులు, వలంటీర్లు, బ్యాంకు సిబ్బంది

తెనాలిరూరల్: స్థానిక వైకుంఠపురంలోని శ్రీ లక్ష్మీ పద్మావతీ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామి హుండీ కానుకలు బుధవారం లెక్కించారు. ఆలయ సహాయ కమిషనర్ ఎం.తిమ్మానాయుడు నేతృత్వంలో శ్రీ సీతారామ స్వామి దేవస్థానం కార్య నిర్వహణాధికారి జి.అమర్‌నాథ్ పర్యవేక్షణలో ఉదయం నుంచి సాయంత్రం వరకూ హుండీలు లెక్కించారు. గత మే 3వ తేదీన హుండీ లెక్కింపు నిర్వహించగా సుమారు 58 రోజుల తర్వాత మళ్లీ బుధవారం లెక్కించినట్లు అధికారులు తెలిపారు. పట్టణానికి చెందిన పలువురు భక్తులు, వివిధ సేవా సంస్థల ప్రతినిధులు, మహిళలు స్వచ్ఛందంగా హుండీ లెక్కింపు సేవలో పాల్గొన్నారు. హుండీ లెక్కింపు ద్వారా రూ.23,33,085 సమకూరినట్లు ఆలయ సహాయ కమిషనర్ తెలిపారు. లెక్కింపులో భక్తులు, వలంటీర్లు, చెంచుపేట ఆప్కాబ్ బ్యాంక్ సిబ్బంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, దేవస్థానం సిబ్బంది పాల్గొని సేవలందించారు.

తక్కెళ్లపాడు వద్ద దారి దోపిడీ

- ఏటీఎం కార్డు పేరుతో అడ్డగింత
- రూ.4 లక్షలు సొమ్ము చోరీ
- పోలీసులకు ఆశ్రయించిన బాధితుడు

పెదకాకాని: పత్తి వ్యాపారిని అడ్డగించి రూ.4 లక్షలు దోచుకెళ్లిన ఘటన బుధవారం మండలంలోని తక్కెళ్లపాడు వద్ద బుధవారం చోటుచేసుకుంది. వివరాలు.. కృష్ణా జిల్లా జి.కొండూరుకు చెందిన పెద్ది సుబ్బారావు పత్తి కొనుగోలు వ్యాపారి. పెదకాకాని మండలంలోని నంబూరు అడ్డరోడ్డు సమీపంలోని అమలోద్భవి హోటల్ యజమాని రవి గతంలో సుబ్బారావు వద్ద తీసుకున్న అప్పు రూ.4 లక్షలు బుధవారం ఇచ్చాడు. నగదు తీసుకుని పెదకాకానిలో నివసిస్తున్న కుమార్తె హేమలత ఇంటికి వెళ్లాడు. అనంతరం ప్రత్తిపాడు మండలం, కోయవారిపాలేనికి చెందిన సాంబశివరావుకు చెల్లించేందుకు రూ.4 లక్షలతో బయలుదేరాడు. తక్కెళ్లపాడు శివారులో జాతీయ రహదారిపై వెళుతుండగా వెనుక నుంచి ముఖానికి ముసుగు(మంకీ క్యాప్) ధరించిన వ్యక్తి బైక్‌పై వచ్చి సుబ్బారావు బైక్‌ను అడ్డుపెట్టి ఆపాడు. నా ఏటీఎం కార్డు ఎందుకు తీసుకున్నావ్ అంటూ వాదనకు దిగాడు. నాకు తెలియదు, నేను తీసుకోలేదని చెబుతున్నా వివాదానికి దిగి జేబులో, బైక్ పర్సులో చెక్ చేశాడు. ఆ సమయంలో సుబ్బారావు వద్ద ఉన్న డబ్బులు లాక్కుని బైక్‌పై వెళ్లిపోయాడు. దీంతో బాధితుడు పెదకాకాని పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వీరాస్వామి తెలిపారు.

వైష్ణవ సంఘ సమాఖ్య కార్యవర్గ సమావేశం



ప్రసంగిస్తున్న తిరుమొళికై అళ్వార్

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని సీతానగరం జీయర్ స్వామి ఆశ్రమంలో ఉభయ రాష్ట్రాల శ్రీవైష్ణవ సంఘాలతో ఏర్పడిన శ్రీ భగవద్రామానుజ శ్రీ వైష్ణవ సంఘ సమాఖ్య కార్యవర్గ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మరింగంటి తిరుమొళికై అళ్వార్ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవైష్ణవ సంప్రదాయ దేవాలయాలు, పీఠాలు, సంఘాల మధ్య సమన్వయం సాధించాలని, తద్వారా సంప్రదాయ రక్షణకు కృషి జరగాలని అన్నారు. కార్యక్రమంలో ఉభయ వేదాంత పీఠం వేద విశ్వవిద్యాలయం ప్రిన్సిపాల్ ముడుంబై మధుసూదనాచార్యులు, జీయర్ ఆశ్రమ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, నల్లాన్ చక్రవర్తుల శ్రీరామ చక్రవర్తి, చక్రవర్తుల శ్రీనివాస రామానుజాచార్యులు, జగన్మోహనాచార్యులు, అగ్రహారం రాఘవేంద్ర, అకలంకం పార్థసారథి, వేదాంతం అచ్యుత కృష్ణ, యతిరాజుల బాలబాలాజీ, ఇతర సమాఖ్య సభ్యులు, అంగలకుదురు వాసుదాసాశ్రమ నిర్వాహకులు పట్టాభి పాల్గొన్నారు.

గుంటూరు రేంజ్‌లో 24 మంది సీఐలు బదిలీ

నగరంపాలెం: గుంటూరు రేంజ్ పరిధిలో సీఐలను బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి ఉత్తర్వులు జారీచేశారు.

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
టి.విజయకృష్ణ	సీసీఎస్ ఒంగోలు	రాపూరు సర్కిల్, నెల్లూరు జిల్లా
పి.సుబ్బారావు	వీఆర్ గుంటూరు	వెంకటాచలంసత్రం సర్కిల్, నెల్లూరు జిల్లా
మారీదు శ్రీనివాసరావు	వీఆర్ గుంటూరు	చీరాల 1 టౌన్ పీఎస్, బాపట్ల జిల్లా
ఎం.విజయచరణ్	సోషల్ మీడియా/సైబర్ క్రైం సెల్, పల్నాడు	నరసరావుపేట -1 టౌన్ పీఎస్
యు.శోభన్‌బాబు	డిఎస్‌బీ2, పల్నాడు జిలా	వినుకొండ టౌన్ పీఎస్ పల్నాడు జిల్లా
పసుపులేటి రామకృష్ణ	వేమూరు సర్కిల్, బాపట్ల జిల్లా	నరసరావుపేట రూరల్ సర్కిల్ పల్నాడు
బి.సుబ్బనాయుడు	ఎస్సీ, ఎస్టీ సెల్ పల్నాడు	చిలకలూరిపేట రూరల్ సర్కిల్, పల్నాడు జిల్లా
కె.వెంకటప్రసాద్	డీఎస్‌బీ3, గుంటూరు	అచ్చంపేట యూపీఎస్, పల్నాడు జిల్లా
ప్రత్తిపాటి సురేష్	రేంజ్ వీఆర్ గుంటూరు	పెదకూరపాడు రూరల్ సర్కిల్, పల్నాడు జిల్లా
పోలూరి శ్రీనివాస్	సత్తెనపల్లి టౌన్, పల్నాడు జిల్లా	సత్తెనపల్లి రూరల్ పీఎస్ పల్నాడు జిల్లా
మార్వనేని సుబ్బారావు	చీమకుర్తి పీఎస్ అటాచ్‌మెంట్	చీమకుర్తి పీఎస్, ప్రకాశం జిల్లా
సీహెచ్.హజరత్తయ్య	దిశ, బాపట్ల	సింగరాయకొండ సర్కిల్, ప్రకాశం జిల్లా
వై.నాగరాజు	రేంజ్ వీఆర్, గుంటూరు	ఒంగోలు 1 టౌన్ పీఎస్, ప్రకాశం జిల్లా
కె.అజయ్‌కుమార్	మహిళా పీఎస్2, నెల్లూరు జిల్లా	ఒంగోలు తాలుకా పీఎస్, ప్రకాశం జిల్లా
పి.వెంకటనారాయణ	నెల్లూరు వి(1) వేదాయపాలెం పీఎస్	కలిగిరి సర్కిల్, నెల్లూరు జిల్లా
ఎ.మల్లికార్జునరావు	రేపల్లె రూరల్ సర్కిల్, బాపట్ల జిల్లా	రేపల్లె టౌన్ పీఎస్ బాపట్ల జిల్లా
పి.కిరణ్	రేంజ్ వీఆర్ గుంటూరు	పట్టాభిపురం పీఎస్ గుంటూరు జిల్లా
ఎం.శేషగిరిరావు	రేంజ్ వీఆర్ గుంటూరు	మార్టూరు యూపీఎస్, బాపట్ల జిల్లా
కాకుమాను వెంకటరావు	సీసీఎస్, గుంటూరు	సంతమంగులూరు సర్కిల్, బాపట్ల జిల్లా
కొంకా శ్రీనివాస్	అరండల్‌పేట పీఎస్ అటాచ్‌మెంట్	అరండల్‌పేట పీఎస్ గుంటూరు జిల్లా

మంగళగిరి టౌన్ పీఎస్‌కు డి.వినోద్‌కుమార్, మంగళగిరి రూరల్ సర్కిల్‌కు యార్లగడ్డ శ్రీనివాసరావు, నల్లపాడు పీఎస్‌కు కె.వంశీధర్, చిట్టెం కోటేశ్వరరావును నెల్లూరు 1 టౌన్ పీఎస్‌కు బదిలీ చేశారు.

వీఆర్‌కు 15 మంది..

సీఐలు పి.శేషగిరిరావు, సి.కృష్ణారెడ్డి, సిరిగిరి సాంబశివరావు, కె.మల్లికార్జున, పి.శ్రీనివాసరెడ్డి, కరిముల్లాషావలి, జి.మంగరావు, ఎం.రాజేష్‌కుమార్, డి.రంగనాథ్, ఎండీ.ఫిరోజ్, ఎం.నజీర్‌బేగ్, ఎస్.విజయచంద్ర, ఎస్‌వీ రాజశేఖర్‌రెడ్డి, కె.నరసింహారావు, బి.అశోక్‌కుమార్‌ను వీఆర్‌కు పంపించారు.

అమ్మ పాలే అమృతం

- బిడ్డకు పాలిస్తే బాలింతకూ ఆరోగ్యం
- నేటి నుంచి తల్లి పాల వారోత్సవాలు



సత్తెనపల్లి: తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు ప్రపంచ వారోత్సవాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలోని 2,031 అంగన్వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు ఈ మేరకు అవగాహన కల్పించనున్నారు. బిడ్డకు ఆరు నెలల పాటు తల్లి పాలను కచ్చితంగా ఇవ్వాలని వైద్యులు సూచిస్తుంటారు. శ్వాసకోశ, అలర్జీ, ఆస్తమా, చర్మ వ్యాధుల నుంచి ఇవి పిల్లలను రక్షిస్తాయి. వారి మానసిక, శారీరక వికాసానికి పోషకాలు అందిస్తాయి. తల్లి పాలు తాగే పిల్లలకు వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. పాలిచ్చే తల్లులకు నెలసరిలో రక్తస్రావం కూడా తక్కువగా ఉంటుంది. రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు రావడానికి అవకాశం చాలా తక్కువ. జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు 09 ఉండగా, అంగన్‌వాడీ కేంద్రాలు 2,031 ఉన్నాయి. వారోత్సవాలకు ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. గర్భిణులు 12,332 మంది, బాలింతలు 10,471 మంది ఉండగా వారికి అవగాహన కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు తగదు

పార్టీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్

మాచర్ల: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల విషయంలో మొదటి నుంచి అత్యంత దారుణంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వం ఇప్పటికీ మాచర్ల నియోజకవర్గంలో అదే తీరు కొనసాగిస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మేరాజోత్ హనుమంత్ నాయక్ అన్నారు. ఈ ప్రాంతాలలో వారిపై ఇంకా దాడులు చేయడం అత్యంత దారుణమని పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇది ప్రజాస్వామిక ప్రభుత్వమా? అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చేటప్పుడు చాలా పథకాలు అమలు చేస్తామని మాయమాటలు చెప్పారన్నారు. తీరా గద్దెనెక్కాక ఎప్పుడూ లేని విధంగా గిరిజన, దళిత, బీసీ వాడల్లోని వారిపై దాడులు చేయడం తగదన్నారు. ఎక్కడా అరాచకాలు జరగలేదని, జరగకుండా చూస్తానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చెప్పినా శ్రీరాంపురంతండ, మరసపెంట, అచ్చమ్మకుంట, చింతలతండ వంటి గిరిజన తండాలలో ఎందుకు దాడులు జరుగుతున్నాయని ప్రశ్నించారు. వీరంతా ఎప్పుడైనా రాజకీయాలలో అగ్రవర్ణాలకు వ్యతిరేకంగా పనిచేశారా అని ప్రశ్నించారు. ఫ్యాక్షన్ రాజకీయ సంస్కృతిని ప్రోత్సహిస్తూ గిరిజన, దళితుల వాడలలోనూ ఆ తరహా వాతావరణం పెంచుతున్నారని పేర్కొన్నారు. ఈ రాజకీయాలు మంచివి కాదన్నారు. ప్రతి కుటుంబానికి చేదోడుగా నిలబడి అందరి అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. లేదంటే ఆయా వర్గాలన్నీ దూరమై ఇబ్బందికర పరిస్థితి ఎదుర్కోవాల్సి వస్తుందని ఎమ్మెల్యేకు సూచించారు. ప్రజల ఆకాంక్షల మేరకు మాత్రమే కూటమి వ్యవహరించాలని, దౌర్జన్యాలు తగవని పేర్కొన్నారు.